

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 32.0 ı కనిష్ఠం : 21.0

యువతితో అసభ్యంగా ప్రవర్తించిన యువకులు

వనపర్తి క్రైమ్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో ఇద్దరు యువకులు ఓ యువతితో అసభ్యంగా ప్రవర్తించిన ఘటన వనపర్తి పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు మంగళవారం సాయంత్రం పట్టణంలోని బస్టాండ్ సమీపంలో మెడికల్ షాప్‌లో పని చేస్తున్న ఓ యువతి వద్దకు శ్రీకాంత్, చందు వెళ్లారు. ఆమెతో అసభ్యంగా ప్రవర్తించడంతో ఫుడ్ డెలివరీకి సంబంధించిన ఫోన్ నెంబర్ ఇవ్వాలని గొడవపెట్టుకున్నారు. అప్పుడే అటు నుంచి వెళ్తున్న ఓ ఎస్ఐ చూసి ఆ యువకులను పట్టుకుని పట్టణ పోలీసులకు అప్పగించారు. ఈ విషయంపై పట్టణ ఎస్ఐ హరిప్రసాద్‌ను సంప్రదించగా... యువతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కొనుగోళ్లేవి?

- ఆశించిన మేర జరగని ధాన్యం సేకరణ
- దిగుమతుల అగ్రిమెంట్లకు మిల్లర్ల ససేమిరా
- పచ్చి వడ్లను పొలం వద్దే కొంటున్న దళారులు
- క్వింటాలుకు రూ.2,000 నుంచి రూ.2,200 మాత్రమే ధర
- కర్ణాటకలోని రాయిచూర్ మార్కెట్‌కు తరలుతున్న వడ్లు
- ప్రభుత్వం పౌరసరఫరాల పాలసీని మార్చడంతో ఇబ్బందులు



మహబూబ్‌నగర్ జిల్లా మన్యంకొండ వద్ద ఆరబోసిన ధాన్యం

మహబూబ్‌నగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): గతేడాది వర్షాలు లేక పంటలు ఎండిపోయి రైతులు ఇబ్బందులు పడితే.. ఈ ఏడాది దండిగా వర్షాలు కురిసి.. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని అమ్ముకోడానికి రైతులు అరిగోస పడే పరిస్థితులు ఏర్పడ్డాయి. పేరుకు ధాన్యం సేకరణ కేంద్రాలు ప్రారంభిస్తున్నప్పటికీ.. ఆశించిన స్థాయిలో కొనుగోళ్లు మాత్రం చేపట్టడం లేదు. ఫలితంగా ఉమ్మడి పాలమూరు జిల్లాలోని మహబూబ్‌నగర్, నారాయణపేట, జోగుళాంబ గద్వాల జిల్లాల్లో రైతులు ధాన్యాన్ని తక్కువ ధరకే దళారులకు అమ్ముకుంటున్నారు. కర్ణాటక సరిహద్దుల్లోని రైతులు రాయిచూర్‌కు తరలిస్తున్నారు. ఈ సీజన్ నుంచి సన్న ధాన్యం సేకరణపై రూ.500 బోనస్ ప్రకటించినప్పటికీ.. అసలు కొనుగోళ్లే చేపట్టకపోవడంతో ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్నాయి. దీన్ని అదునుగా చేసుకున్న దళారులు.. రైతుల పొలం వద్దనే కొనుగోలు చేస్తూ, సన్న ధాన్యానికి రూ.2,000 నుంచి రూ.2,200 వరకు ధర ఇస్తున్నారు. దీనివల్ల రైతులు సన్న ధాన్యంపై ఒక్కో క్వింటాలుకు రూ.600 నుంచి రూ.800 వరకు కోల్పోతుంటే, దొడ్డు రకాలు సాగు చేసిన వారు రూ.200 నుంచి రూ.300 వరకు నష్టపోతున్నారు. కొంతమంది రైతులు రోడ్లపై ఆరబెట్టగా, మరికొందరు సేకరణ కేంద్రాలకు తెచ్చి ఎప్పుడు కొంటారా? అని ఎదురుచూస్తున్నారు.

కర్ణాటకకు తరలుతున్న ధాన్యం

గతంలో నుంచి కూడా ఉమ్మడి పాలమూరు జిల్లాలోని కర్ణాటక సరిహద్దుల్లో ఉన్న రైతులు ధాన్యాన్ని రాయిచూర్ మార్కెట్‌కు తరలించడం సర్వసాధారణమే. అప్పట్లో ఇక్కడ ఇచ్చే ధర కంటే ఎక్కువ వస్తుండటం, డబ్బులు

(మిగతా 6లో..)

భరోసా సెంటర్ ద్వారా మహిళలకు రక్షణ

- గద్వాల కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల న్యూటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : భరోసా సెంటర్ ద్వారా మహిళలకు రక్షణతో పాటు న్యాయం లభిస్తుందని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. మంగళవారం గద్వాల పట్టణంలో నూతనంగా నిర్మించిన భరోసా సెంటర్ భవనాన్ని ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఈ సెంటర్ల ద్వారా మహిళలకు పూర్తి రక్షణ కల్పించే విధంగా సేవలు ఉంటాయన్నారు. మహిళలు ఈ సెంటర్ సేవలపై అవగాహన పెంచుకోవాలన్నారు. జిల్లా కేంద్రంలో భరోసా సెంటర్ నిర్మాణానికి మెగా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రూ.2.10 కోట్లు వెచ్చించడం గొప్ప విషయమన్నారు. ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. భరోసా కేంద్రం ద్వారా బాధిత మహిళలు, బాలికలకు న్యాయం జరిగేలా కృషి చేస్తామన్నారు. భరోసా కేంద్రాలలో దేశంలోనే తెలంగాణ ముందంజలో ఉందని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 195 కేసులు నమోదు కాగా 158 పోక్సో కేసులు ఉన్నాయని, అన్నింటికి కౌన్సెలింగ్ ఇచ్చామని తెలిపారు. 138 మంది బాధిత మహిళలకు రూ. 35 లక్షల నష్టపరిహారం ఇప్పించినట్లు ఆయన తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన 14 మంది బాధిత మహిళలకు రూ. 1లక్షా17 వేలు అందించామని, ఒక పోక్సో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 5వేల జరిమానా విధించామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, అదనపు ఎస్పీ గుణశేఖర్, జిల్లా సంక్షేమాధికారి సుధారాణి, డీఎస్పీ సత్యనారాయణ, సాయుధ దళ డీఎస్పీ నరేందర్‌రావు, మెగా కంపెనీ అసోసియేట్ జనరల్ మేనేజర్ నాగరాజు, పోలీస్ అధికారులు ఉన్నారు.



భరోసా సెంటర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్



బైరాపురం సమీపంలో ఉల్లి గడ్డలను ఆరబోసిన రైతు

తగ్గిన దిగుబడి పెరిగిన ధర

- గత ఏడాదితో పోలిస్తే తగ్గిన ఉల్లి సాగు
- అధిక వర్షాలతో దెబ్బతిన్న పంట

7

రూ.3 కోట్లతో ఆడిటోరియం

- డివిజన్ స్థాయి ఆటల పోటీలు ప్రారంభించిన మంత్రి జూపల్లి



క్రీడాజ్యోతితో పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి):నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణంలో రూ.3 కోట్లతో ఆడిటోరియం ఏర్పాటుకు కృషి చేస్తానని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఈ నెల 27, 28, 29వ తేదీలలో నిర్వహించనున్న ఆర్ఐడీ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల వారోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం కొల్లాపూర్ మినీ స్టేడియంలో నిర్వహించిన డివిజన్ స్థాయి ఆటల పోటీలను ఆయన ప్రారంభించారు. క్రీడాజ్యోతి వెలిగించి ఆటల పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన క్రీడాకారులను, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. త్వరలోనే కొల్లాపూర్ పట్టణంలో ఆడిటోరియం ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. ఆర్ఐడీ ఉన్నత పాఠశాల, కళాశాల పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఆత్మీయ సమ్మేళనానికి దేశ విదేశాల నుంచి పూర్వ విద్యార్థులు హాజరవుతున్నారని తెలిపారు. క్రీడాకారులు క్రీడల్లో రాణించి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు సాధించాలని సూచించారు. అనంతరం ప్రాథమిక పాఠశాల నుంచి డిగ్రీ కళాశాల వరకు మినీ స్టేడియంలో నిర్వహించిన డివిజన్ స్థాయి ఆటల పోటీలలో విద్యా ర్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్ఐడీ పూర్వ విద్యార్థుల వారోత్సవాల కమిటీ అధ్యక్షుడు డాక్టర్ సాయిప్రసాద్, రిటైర్డ్ డీఈఓ కటికనేని మధుసూదన్ రావు, రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ దివాకర్ రావు, కొల్లాపూర్ మునిసిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్య ఎంఈవో తదితరులు పాల్గొన్నారు.



చందాయపల్లి శివారు డంపింగ్ యార్డు

చెత్త శుద్ధి ఏదీ?

- తడి, పొడి చెత్త వేరు చేయడం లేదు
- నాగర్‌కర్నూల్ డంపింగ్ యార్డులో తగులబెడుతున్న చెత్త

6

దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

- వికారాబాద్ కలెక్టర్‌పై దాడికి ఖండన
- కలెక్టరేట్‌లో రెవెన్యూ, టీఎన్‌జీవోస్, టీజీవోస్‌ల నిరసన



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రెవెన్యూ, టీఎన్‌జీవోస్, టీజీవోస్‌లు

నాగర్‌కర్నూల్‌టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్లలో ఆ జిల్లా కలెక్టర్‌తో పాటు రెవెన్యూ అధికారులపై జరిగిన దాడిని జిల్లా రెవెన్యూ, టీఎన్‌జీవోస్, టీజీవోస్ ఉద్యోగులు ఖండించారు. కలెక్టరేట్‌లో రెవెన్యూ, టీఎన్‌జీవోస్, టీజీవోస్ ఉద్యోగులు మంగళవారం నల్ల బాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. దాడిచేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని కలెక్టర్ బదావత్ సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడుతూ వికారాబాద్ జిల్లా కలెక్టర్‌తో పాటు ఇతర ఉద్యోగులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. విధి నిర్వహణలో ఉన్న ఉన్నతాధికారులపై క్రిమినల్స్ తరహా లో మూకుమ్మడిగా దాడి చేయడం శోచనీయమన్నారు. ఇటీవలే కాలంలో రెవెన్యూ ఉద్యోగులపై దాడులు నిత్యకృత్యమైపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. దాడికి పాల్పడిన వారందరినీ కఠినంగా శిక్షించి మరోమారు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వ ఉద్యోగులకు రక్షణ కల్పించేలా కఠిన చట్టాలు అమలు చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, డీర్డీవోలు, తహసీల్దార్లు, టీజీవోస్ జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ ఖాజా మైనుద్దీన్, రెవెన్యూ ఉద్యోగులసంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నకిష్టన్న, టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ పాల్గొన్నారు.

క్లిక్.. క్లిక్..



అస్తమిస్తున్న సూర్యుడు

పడమటి సంధ్యారాగం

సాయం సంధ్య వేళ సూర్యుడు కనువిందు చేశాడు. పసిడి కిరణాలను ఆకాశమంతా విరజిమ్ముతూ, కొండల్లోకి జారుకుంటూ ఆకట్టుకున్నాడు. పూర్తిగా అస్తమయం అయ్యాక ఆకాశం నీలిరంగులోకి మారింది. వనపర్తి మండలం చిట్యాల నుంచి అచ్యుతాపూర్ వెళ్లే దారిలో కనిపించిన ఈ దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి' మంగళవారం క్లిక్ మనిపించింది.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వనపర్తి



కొండల వెనక్కి వెళ్తున్న సూర్యుడు

53 మంది కూలీలకు గాయాలు

- కొత్తకోట మండలం కనిమెట్ట వద్ద బొలెరో బోల్తా పడి 35 మందికి..
- జడ్చర్ల మండలం పెద్దఆదిరాల వద్ద ట్రాక్టర్ బోల్తా పడి 18 మందికి..
- కనిమెట్ట ప్రమాదంలో ఐదుగురికి తీవ్ర గాయాలు..
- ముగ్గురి పరిస్థితి విషమం

7



కనిమెట్ట వద్ద ప్రమాదంలో గాయపడిన కూలీలు

ఆహార హక్కుకు.. భంగం కలిగిస్తే చర్యలు

- అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించాలి
- కలెక్టర్ పనితీరు బాగుంది
- తెలంగాణ ఆహార కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ ఆహార కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి

నాగర్‌కర్నూల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఆహార హక్కుకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవని, అధికారులందరూ క్షేత్రస్థాయిలో పర్యటించాలని తెలంగాణ ఆహార కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జాతీయ ఆహార భద్రత చట్టం 2013 అమలుపై మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశానికి తెలంగాణ ఆహార కమిషన్ సభ్యులు ఓరుగంటి ఆనంద్, రంగినేని శారద, బుక్యజ్యోతి, అదనపు కలెక్టర్ కే.సీతారామారావు, సంబంధిత శాఖ అధికారులు కలెక్టర్ బదావత్ సంతోష్‌తో కలిసి హాజరయ్యారు. తొలుత పౌరసరఫరాలు, ఐసీడీఎస్, వెల్ఫేర్ హాస్టల్స్, మధ్యాహ్న భోజన పథకం, వైద్యశాఖ తదితర శాఖల అధికారులు, పాఠశాలల హెచ్ఎంలు, సంక్షేమ వసతి గృహ సంరక్షకులు, అంగన్‌వాడీ కార్యకర్తలతో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై గోలి శ్రీనివాస్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ ఆహార భద్రత చట్టం అమలులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా పర్యవేక్షణ చేస్తున్నామని తెలిపారు. అందులో భాగంగానే నేడు నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి, వెల్దండ మండలాల్లో అంగన్‌వాడీలు, వసతి గృహాలు, రేషన్ దుకాణాలను తనిఖీ చేశామన్నారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు, పౌరసరఫరాలు, స్త్రీ శిశు సంక్షేమ, విద్యాశాఖ, వెల్ఫేర్ హాస్టల్స్ మధ్యాహ్న భోజన పథకంపై తదితర శాఖల అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించనున్నామని తెలిపారు. జిల్లాలో తనిఖీలు చేసిన వివిధ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థుల రుచికరమైన భోజనం చేయడం గమనించామన్నారు. ఒకటి రెండు చోట్ల విద్యార్థులు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు లోపాలను సరి చేసుకుని నాణ్యమైన ఆహారం అందించాలని ఆదేశించామని తెలిపారు. కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లా డుతూ జాతీయ ఆహార భద్రత చట్టం-2013ను సమర్థవంతంగా అమలు చేసేందుకు జిల్లా యంత్రాంగం పూర్తి చర్యలు తీసుకుంటుందని అన్నారు. మెనూ ప్రకారం హాస్టళ్లలో పౌష్టిక ఆహారం అందేలా పర్యవేక్షిస్తామన్నారు. వెల్దండ మండలంలోని బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో వసతులు లేవని ఫుడ్ కమిషన్ చైర్మన్ దృష్టికి రావడం పట్ల అక్కడి పరి స్థితులను వెంటనే పరిశీలించి నివేదికను సమర్పించాలని జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి వెల్దండ తహసీల్దార్‌ను ఆదేశించారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

- డీసీసీబీ ఇన్‌చార్జి ముఖ్య కార్యనిర్వహణాధికారి పురుషోత్తమరావు



సీఈవోను వివరాలు అడుగుతున్న డీసీసీబీ జీఎం పురుషోత్తమరావు

ఉప్పునుంతల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది వివిధ స్కీంల కింద కలిపి రూ.400 కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు డీసీసీబీ ఇన్‌చార్జి ముఖ్య కార్యనిర్వహణాధికారి పురుషోత్తమరావు తెలిపారు. స్థానిక సింగిల్‌విండో కార్యాలయాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు రూ.100 కోట్లను వివిధ రుణాల కింద లబ్ధిదారులకు అందజేసినట్లు ఆయన తెలిపారు. జిల్లాలోని అచ్చంపేట డీసీసీబీ బ్రాంచ్ నుంచే రూ.160 కోట్ల రుణాలు అందజేసినట్లు ఆయన తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉప్పునుంతల, కొండనాగుల సంఘాలు బాగా పనిచేస్తున్నాయని అన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా డీసీసీబీ ఆధీనంలో 78 సహకార సంఘాలు పని చేస్తున్నట్లు ఆయన చెప్పారు. నెలాఖరు వరకు ఖాతాదారులకు మరింత చేరేవయ్యేందుకు ఫోన్ పే, గూగుల్ పే సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో అచ్చంపేట డీసీసీబీ మేనేజర్ రవికుమార్, సహాయ మేనేజర్ మోహన్ ఉన్నారు.

రైతులకు ఇబ్బంది కలిగించొద్దు

- కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ ఆదర్శ్ సురభి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



గోపాల్‌పేట మండలం చెన్నూరు గ్రామంలోని కొనుగోలు కేంద్రం వద్ద తేమ శాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

వనపర్తి అర్బన్, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలలో 'అన్నదాతల పడిగాపులు' అనే శీర్షికన మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ ఆదర్శ్ సురభి స్పందించారు. మంగళవారం గోపాల్‌పేట మండలంలోని చెన్నూరు, వనపర్తి మండలంలోని చిమనగుంటపల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ధాన్యం క్లీనింగ్ విషయంలో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఒక కేంద్రంలో ఒకే రకమైన ధాన్యాన్ని కొను గోలు చేయాలని, దొడ్డు, సన్నాలు ఒకే దగ్గర కొనుగోలు చేయడానికి అనుమతిం చేది లేదని తెలిపారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే నగదు చెల్లింపు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం చిట్యాల శివారులో ఉన్న గోదాములను పరిశీలించారు. ధాన్యం నిలువ చేయడానికి ఎంత మేర ఖాళీ స్థలం ఉందని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సివిల్ సప్లయ్ అధికారి కాశీ విశ్వనాథ్, వనపర్తి తహసీల్దార్ రమేష్‌రెడ్డి, గోపాల్‌పేట తహసీల్దార్ తిలక్‌రెడ్డి, ఎంపీడీవో తదితరులు ఉన్నారు.

కొనుగోళ్లేవి?

(మొదటి పేజీ తరువాయి)

వెంటనే ఇస్తుండటంతో అమ్మేవారు. కానీ ప్రస్తుతం మద్దతు ధరతోపాటు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించినప్పటికీ.. ధాన్యాన్ని కర్ణాటక వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఇంకా పూర్తి స్థాయిలో వరి కోతకు రాలేదు. ముందుగా వేసుకున్న పంట మాత్రమే వస్తోంది. కానీ, అప్పటివరకు కొనుగోలు కేంద్రాల్లో సేకరణ వేగం పెంచకపోతే రైతులు మరింత ఇబ్బందులు పడే అవకాశం ఉంది. ఈ సీజన్‌లో అత్యధికంగా వరిసాగులోకి వచ్చింది. దాదాపు 13 లక్షల మెట్రిక్ టన్నుల మేర ధాన్యం సేకరించాలని లక్ష్యం పెట్టుకున్నారు. కానీ పరిస్థితి చూస్తే అందులో సగమైనా ప్రభుత్వం ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తారా? అనే అనుమానాలు కలుగుతున్నాయి.


వనపర్తి జిల్లా జగత్‌పల్లి సేకరణ కేంద్రం వద్ద ధాన్యం కుప్పలు

పాలసీలో మార్పులే కారణం..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పౌరసరఫరాల శాఖపై ప్రత్యేక దృష్టి సారించింది. ప్రభుత్వం అప్పులు తెచ్చి, సేకరించిన ధాన్యాన్ని ఎలాంటి పూచికత్తు లేకుండా మిల్లర్లకు అప్పగిస్తుంటే.. వారు సమయానికి సీఎంఆర్ అప్పగించడం లేదు. పైగా గోల్‌మాల్ చేస్తున్నారని భావించి, కొన్ని మార్పులు చేసింది. దీని ప్రకారం డీఫాల్ట్ మిల్లులకు జరిమానాలు విధించగా, ధాన్యం కేటాయించే మిల్లర్లు బ్యాంకు గ్యారంటీలు ఇవ్వాలని సూచించిన విషయం తెలిసిందే. అలాగే మిల్లింగ్ ధరలను కూడా పెంచింది. క్వింటాల్ ధాన్యంపై ఇవ్వాల్సిన బియ్యాన్ని తగ్గించడ లేదు. ఈ నేపథ్యంలో ఉమ్మడి పాలమూరు జిల్లాలో రైస్‌మిల్లర్లు అగ్రిమెంట్లు చేసుకోవడానికి ఎక్కడా ముందుకు రావడం లేదు. ఉదాహరణకు జోగుళాంబ గద్వాల జిల్లాలో 61 రైస్ మిల్లులు ఉండగా, అందులో 11 మిల్లులు డీఫాల్ట్ కింద ఉన్నాయి. 20 రైస్ మిల్లుల నుంచి సీఎంఆర్ పెండింగ్‌లో ఉంది. 30 మిల్లులకు క్లియరెన్స్ ఉన్నప్పటికీ వాటికి బ్యాంకు గ్యారంటీలు అడుగుతున్నారు. అలాగే సీఎంఆర్ పెండింగ్ ఉన్న 20 మిల్లులకు సెక్యూరిటీ డిపాజిట్‌తోపాటుపాటు 25 శాతం ఫైన్ అడుగుతున్నారు. దీంతో రైస్ మిల్లర్లు ముందుకు రాక, అగ్రిమెంట్లు జరగడం లేదు. ఇక్కడ ఇప్పటివరకు 59 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. నారాయణపేట, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్‌లో కూడా అగ్రిమెంట్లు కావడం లేదు. అగ్రిమెంట్లు అయితేనే రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని మిల్లులకు తరలించే అవకాశం ఉంది. లేకపోతే సేకరించిన ధాన్యం కల్లాల్లోనే మిగిలిపోనుంది.

ఆలస్యం చేస్తే రైతులు ఆగం..

పౌరసరఫరాల పాలసీని మార్చే క్రమంలో ఆ మంత్రిత్వశాఖ ఆలస్యం చేయడమే కొనుగోళ్లలో జాప్యానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. సీజన్ ముంచుకొస్తున్న దశలో పాలసీలో మార్పులు చేయడంతో మిల్లర్లు అందుకు ఒప్పుకోవడానికి చాలా సమయం తీసుకునే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం ఆ మార్పుల ప్రకారమే నడుచుకుంటుందని తేల్చిచెబుతుండటంతో పాటు బ్యాంకు గ్యారంటీలు, సెక్యూరిటీ డిపాజిట్లు, జరిమానాలపై వెనక్కి తగ్గడం లేదు. ఎలాగూ రైతుల నుంచి ఒత్తిడి వస్తే తమనే పిలిచి ధాన్యం కేటాయిస్తారనే భావనతో మిల్లర్లు కూడా మొండికేస్తున్నారు. అటు దళారుల రంగ ప్రవేశంతో రైతులు మద్దతు ధర కంటే తక్కువకు ధాన్యం విక్రయిస్తున్నారు. ప్రస్తుతం అధికార వ్యవస్థ మొత్తం సామాజిక ఆర్థిక, రాజకీయ, కుల సర్వేతోపాటు.. ధాన్యం కొనుగోళ్లపై దృష్టి సారిస్తారా? లేదా అనేది వేచిచూడాలి. ఇప్పటికే రైతుబంధు రాకపోవడం, రుణమాఫీ అమలులో నెలకొన్న ఆటంకాలతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్న రైతాంగం.. కొనుగోళ్ల అవస్థలతో రోడ్డెక్కే పరిస్థితి వస్తుందని పలువురు భావిస్తున్నారు.

న్యాక్ టీం వచ్చేసరికి సర్వం సిద్ధం చేయాలి


పీయూ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్

● వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్

పాలమూరు యూనివర్సిటీ, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): న్యాక్ టీం వచ్చేసరికి సర్వం సిద్ధం చేయాలని పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ అధికారులకు సూచించారు. మంగళవారం పాలమూరు యూనివర్సిటీలోని పరిపాలన భవనంలో నిర్వహించిన పీయూ అధికారుల సమావేశంలో మాట్లాడుతూ.. గత ఐదు సంవత్సరాలలో ఏ డేటా అప్లోడ్ చేశామో దానికి సంబంధించిన డాక్యుమెంట్స్ సిద్ధంగా ఉంచాలని అన్నారు. ఆయా క్రైటీరియా కో ఆర్డినేటర్స్ అవసరమైన డాక్యుమెంట్స్ సరిచూసుకోవాలన్నారు. న్యాక్‌కు సంబంధించిన ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. న్యాక్ గ్రేడింగ్ పెరిగితే పీయూకి మరిన్ని నిధులు వస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ నూర్జహాన్, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ రాజ్ కుమార్, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ అంకం భాస్కర్, ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రకిరణ్, డాక్టర్ బషీర్ అహ్మద్, వివిధ క్రైటీరియల కో ఆర్డినేటర్స్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో పనిచేయని సోలార్ హీటర్

● చన్నీటితో స్నానం చేస్తున్న విద్యార్థినులు

● అస్వస్థతకు గురై ఆస్పత్రికి..


పీహెచ్‌సీకి వచ్చిన కేజీబీవీ విద్యార్థినులు

దామరగిద్ద, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోనిఒ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సమస్యలతో విద్యార్థినీలు అవస్థలకు గురవుతున్నారు. పాఠశాలలో 200 మంది, కళాశాలలో 180 మంది విద్యార్థులు ఉన్నారు. కళాశాలకు సొంత భవనం లేకపోవడంతో పాఠశాలలోనే చదువుతున్నారు. ప్రభుత్వం దుప్పట్లు, యూనిఫామ్స్ పంపిణీ చేయలేదు. దీనికి తోడు సోలార్ హీటర్ ఏర్పాటు చేసినా నిరుపయోగంగా పడింది. ఈ కారణంగా బాలికలు ఉదయం 4 గంటలకు లేచి చలిలో చల్లటి నీటితో స్నానం చేయడంతో జలుబు, జ్వరం, ఒళ్లు నొప్పులు, గొంతులో ఇన్‌ఫెక్షన్‌తో బాధడుతున్నారు. వారం రోజులుగా 15 నుంచి 20 మంది దాకా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి డాక్టర్‌తో చూయించుకుని మందులు తీసుకెళ్తున్నారు. పాఠశాల బయట సెప్టిక్ ట్యాంక్ సరిగా నిర్మించకపోవడంతో రోడ్డుపై వెళ్లే వారికి దుర్వాసన వస్తుందంటే పరిస్థితి ఎలా ఉందో ఇట్టే అర్థమవుతుంది. దీనిపై పీహెచ్‌సీ వైద్యాధికారి కీర్తి మాట్లాడుతూ.. జ్వరం, ఒళ్లు నొప్పులు, జలుబు, దగ్గుతో విద్యార్థులు బాధపడుతున్నట్లు తెలిపారు. తాము ఇచ్చిన మందులు కూడా సమయం ప్రకారం విద్యార్థినులకు ఇవ్వడం లేదన్నారు. కేజీబీవీ ప్రత్యేక అధికారి విజయ మాట్లాడుతూ సోలార్ హీటర్ పని చేయకపోవడంతో విద్యార్థినులు ప్రతి రోజు చల్లటి నీళ్లతో స్నానం చేస్తున్నారని తెలిపారు.


పని చేయని సోలార్ హీటర్


చిన్నపొర్లలో స్వామి వారి రథాన్ని లాగుతున్న భక్తులు

వైభవంగా పాండురంగ స్వామి రథోత్సవం

ఊట్కూర్, నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నపొర్లలో వెలిసిన పాండురంగస్వామి రథోత్సవం మంగళవారం సాయంత్రం వైభవంగా జరిగింది. ఆలయం వద్ద స్వామి వారి రథానికి పూలతో అలంకరించి, పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు, యువతులు హారతులతో స్వాగతం పలుకుతూ రథాన్ని లాగారు. భక్తులంతా రథాన్ని లాగుతూ బస్టాండ్ సమీపం వరకు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా గ్రామం మొత్తం సందడిగా మారింది. రాత్రి ఆలయం వద్ద భజనలు చేశారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రాజాపూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండల పరిధిలోని తిరుమలాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాలలో తొమ్మిదివ తరగతి చదువుతున్న జే ధనుష్ 400 మీటర్ల రన్నింగ్, ఏడవ తరగతి చదువుతున్న జే రాజేశ్ ఖోఖో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు ఖమ్మ జిల్లాలో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొననున్నారు. వారిని ఉపాధ్యాయుడు పాల్, పీఈటీ రాములు అభినందించారు.

అథ్లెటిక్స్ పోటీలకు పెద్దఆదిరాల విద్యార్థులు

జడ్చర్ల, (ఆంధ్రజ్యోతి) : ఖమ్మం జిల్లాలో ఈ నెల 15న జరగబోయే 68వ రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు జడ్చర్ల మండలం పెద్దఆదిరాల జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థినీ స్వాతికరెడ్డి ఎంపికయ్యింది. పాఠశాల 8వ తరగతి చదువుకుంటున్న విద్యార్థి స్వాతికరెడ్డి ఈ నెల 2న, 5న జరిగిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థాయి పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి అండర్-14 విభాగంలో హైజంప్ పోటీలకు ఎంపికయ్యిందని పీఈటీ మోయిన్ తెలిపారు. పాఠశాల ఆవరణలో స్వాతికరెడ్డిని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

అతిథి అధ్యాపకుల ఎంపిక

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల , బీఎడ్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపకుల భర్తీకి అర్హులైన నిరుద్యోగ, రిటైర్డ్ అధ్యాపకులు దరఖాస్తు చేసుకోగా, వారికి మంగళవారం డైట్ , బీఎడ్ కళాశాలల్లో అభ్యర్థులకు ఎంపికలకు సంబంధించి విద్యార్థుల పాఠ్యబోధన, ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఎంపికలను ఆర్జీడీ విజయలక్ష్మి, నాగర్‌కర్నూల్ డీఈవో బీఎడ్ కళాశాల ప్రిన్సిపాల్ గోవిందరాజులు, మహబూబ్‌నగర్ డీఈవో కార్యాలయం ఏడీ అనసూయ, డైట్ ప్రిన్సిపాల్ మొరజుల్లాఖాన్ తదితరులు పరిశీలించారు. బోధన ఆధారంగా ఎంపికలు నిర్వహించారు.

ప్రియుడితో కలిసి భర్తను చంపిన భార్య

- భార్య హిమబిందుతో పాటు ప్రియుడు చంటి, మరొకరి రిమాండ్
- వివరాలు వెల్లడించిన ఎస్పీగైక్వాడ్ వైభవ్ రఘునాథ్


విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ

నాగర్‌కర్నూల్ క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రియుడితో కలిసి భర్త రాత్లావత్ రాజు(30)ను హత్య చేసిన ఘటనలో భార్య హిమబిందు, ప్రియుడు చంటి, అతని స్నేహితుడు కుర్ర రాజేష్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలిపారు. కల్వకుర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లు, వెల్దండ సీఐ విష్ణువర్ధన్‌రెడ్డిలతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వివరాలను వెల్లడించారు. వెల్దండ మండలం ఎంజీ తండాకు చెందిన రాత్లావత్ రాజు, అదే తండాకు చెందిన హిమబిందును తొమ్మిదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. ఏడాదిగా హిమబిందు చంటి అనే వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకున్నది. ఈ విషయం రాజుకు తెలియడంతో ఈ నెల 5వ తేదీన భార్యను, ఆమె ప్రియుడు చంటిని మందలించాడు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని రాజును హత్య చేయాలని అతని భార్య, ఆమె ప్రియుడు చంటి పథకం పన్నారు. వ్యవసాయ పొలం దగ్గర రాజు అతని భార్య మంచంపై పడుకుని ఉండగా, చంటి, అతని స్నేహితుడు కొర్ర రాజేష్ పొలం దగ్గరికి వెళ్లారు. హిమ బిందును లేపుకుని పక్కకు వచ్చి తన దగ్గర తెచ్చుకున్న సుత్తెతో నిద్రలో ఉన్న రాజు తలపై కొట్టాడు. నిద్రలో నుంచి లేచిన రాజు తిరగబడడంతో హిమబిందు, చంటి, స్నేహితులు రాజేష్ కలిసి రాజు రెండు కాళ్లు పట్టుకోగా రాజు ముఖం, తలపై చంటి బలంగా కొట్టి చంపాడు. కొంచెం దూరం శవాన్ని తీసుకెళ్లి పడేశారు. మంచమంతా రక్తం కావడంతో మంచం కడిగి అక్కడే పెట్టి సుత్తె తీసుకుని చంటి అతని స్నేహితుడు రాజేష్‌లు వెళ్లిపోయారు. ఆ తర్వాత హిమబిందు తన భర్త కనిపించడం లేదని మృతుడి అన్న లాలూకు ఫోన్ చేసి చెప్పిందని తెలిపారు. మృతుని తండ్రి రాత్లావత్ వాస్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటనపై కల్వకుర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ విష్ణువర్‌రెడ్డి, ఎస్ఐ కురుమూర్తి, పోలీస్ సిబ్బంది ఆగమేఘాల మీద దర్యాప్తు చేసి నిందితులను పట్టుకోవడంతో ఎస్పీ డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్ఐ కురుమూర్తి, పోలీస్ సిబ్బంది కిశోర్‌రెడ్డి, మురళీకృష్ణ, జానకిరాం, ఆంజనేయులు, నవీన్‌యాదవ్, అమర్ సింగ్, సందీప్‌లను అభినందించారు.

చెత్త శుద్ధి ఏదీ?

- తడి, పొడి చెత్త వేరు మాటే లేదు
- నాగర్‌కర్నూల్ డంపింగ్ యార్డులో చెత్తను తగులబెడుతున్న సిబ్బంది
- పొగతో ఇబ్బంది పడుతున్న రైతులు, స్థానికులు


నాగర్‌కర్నూల్ : చందాయపల్లి శివారు డంపింగ్ యార్డు వద్ద పారబోసిన తడి, పొడి చెత్త

నాగర్‌కర్నూల్ టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ పట్టణ ప్రజలు తడి, పొడి చెత్త వేరుచేసే మాటేలేదు అంతా కలిపివేస్తున్నారు. మెరుగైన శానిటరీ, పర్యావరణ హితం విధానాలను అనుసరించాల్సి ఉండగా చెత్త సేకరణలో ఎన్నో లోపాలున్నాయి. నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీలో తడి, పొడి చెత్త వేరు ప్రక్రియ జరుగకపోవడం ప్రధాన సమస్యగా మారింది. మునిసిపాలిటీగా ఏర్పడిన నాటి నుంచి చెత్త వేరు చేయు విధానాన్ని అమలు చేస్తామని అధికారులు చెబుతున్నప్పటికీ అచరణలో సాధ్యం కావడం లేదు. చెత్త వేరు ప్రక్రియ జరగకపోవడం వల్ల డంపింగ్ యార్డు వద్ద చెత్తను తగలబెడుతున్నారు. దీంతో పరిసర ప్రాంత రైతులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

నాగర్‌కర్నూల్ పట్టణ సమీపంలోని చందాయపల్లి శివారులో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డు వద్ద తడి,పొడి చెత్త వేరు చేసే యంత్రమే కనిపించడం లేదు. వేరు చేసిన చెత్తతో వర్మీ కంపోస్టు తయారు చేయాల్సి ఉండగా గోతులు తవ్వి అందులో చెత్త వేసి వదిలేశారు. దీంతో వర్మీ కంపోస్టు ప్రక్రియ జరగడం లేదు. నిత్యం టన్నుల కొద్ది వచ్చే చెత్తను యార్డులో స్థలం లేక రాశులుగా పోసి తగలబెడుతున్నారు. దీంతో వచ్చే పొగ కారణంగా సమీపంలోని రైతులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి చెత్తను తగలబెట్టకుండా వర్మీ కంపోస్టు తయారీ ప్రక్రియను చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

దుర్వాసన వస్తోంది



డంపింగ్ యార్డును వ్యవసాయ పొలాల మధ్య ఏర్పాటు చేశారు. మురిగిన చెత్త అంతా రోడ్డు పక్కనే పోస్తున్నారు. దీంతో దుర్వాసన వస్తోంది. చెత్తను తగులబెట్టడంతో వచ్చే పొగ నుంచి తీవ్ర ఇబ్బంది పడుతున్నాం.

- తీగల భాస్కర్, రైతు, నాగర్‌కర్నూల్

పర్యావరణం కాపాడాలి



చెత్త సేకరణలోనే మునిసిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. తడి, పొడి చెత్త వేరుగా అందించడంపై ప్రజల్లో అవగాహన కల్పించాలి. డంపింగ్ యార్డు వద్ద చెత్త నిర్వహణ పద్ధతులను అమలు చేయాలి. సేకరించిన చెత్తతో వర్మీ కంపోస్టు తయారు చేసి పర్యావరణాన్ని కాపాడాలి.

- వావిలాల రాజశేఖర్‌శర్మ, సామాజిక కార్యకర్త, నాగర్‌కర్నూల్

నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు

● వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, నవంబరు12 (ఆంధ్రజ్యోతి) : గ్రూప్-3 పరీక్ష రాసేందుకు నిర్ణీత సమయానికి నిమిషం ఆలస్యమైనా లోపలికి అనుమతి ఉండదని కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. మంగళవారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రూప్ 3 పరీక్షలు నవంబరు 17, 18 తేదీల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 10 నుంచి 12:30 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి 5:30 గంటల వరకు నిర్వహిస్తారన్నారు. పరీక్ష రాసేందుకు అభ్యర్థులు నిర్ణీత సమయం కంటే ముందే రావాలని సూచించారు. నిమిషం ఆలస్యమైనా లోపలికి అనుమతి ఉండదని తెలియజేశారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు గుర్తింపు కార్డు ఒరిజినల్ తీసుకు రావాలని తెలియజేశారు. బ్లూ లేదా బ్లాక్ పాయింట్ పెన్ను, హాల్ టికెట్, ఏదైనా గుర్తింపు కార్డు తప్ప మరే విధమైన వస్తువులు పరీక్ష కేంద్రంలోకి అనుమతి ఉండదని తెలిపారు. సెల్‌ఫోన్‌లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, పేజర్స్, టాబ్లెట్స్ పెన్‌డ్రైవ్ , బ్లూటూత్ , గడియారం, గణిత టేబుల్, లాగ్ పట్టికలు, పర్స్, పరీక్ష ప్యాడ్, నోట్ బుక్స్ లేదా విడి పేపర్లు, ఆభరణాలు (మంగళసూత్రం, గాజులు తప్ప) హ్యాండ్ బ్యాగులు, పౌచ్‌లు తీసుకుని రావద్దని తెలిపారు. ఒకవేళ డౌన్‌లోడ్ చేసుకున్న హాల్ టికెట్ బ్లర్‌గా ఉన్నా , ఫొటో సరిగ్గా కనిపించకపోయినా (3)పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో వెబ్‌సైట్‌లో పెట్టిన ప్రోఫార్మలో అండర్ టేకింగ్ లెటర్ పై గెజిటెడ్ అధికారి సంతకం తీసుకుని రావాల్సి ఉంటుందన్నారు. పరీక్షలు నిర్వహించే సమయాల్లో 144 సెక్షన్ అమలు చేయాలని, అన్ని జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌లను ఆదేశించారు. పరీక్షలకు సంబంధించిన ఏదైనా సమస్యలు వస్తే కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్ 08545-233525 నెంబర్‌కు ఫోన్ చేసి సహాయం పొందవచ్చని తెలియజేశారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ తేజావత్ రామదాసు, వివిధ శాఖల సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అలుగును తరలిస్తున్న ముఠా అరెస్ట్

- 11 మంది రిమాండ్‌కు తరలింపు
- మరో ఇద్దరు నిందితుల పరారీ
- నాగర్‌కర్నూలు డీఎఫ్‌వో రోహిత్ గోపిడి

మన్ననూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూలు జిల్లా నల్లమల ప్రాంతంలో అలుగు (అడవి జంతువు)ను విక్రయించేందుకు తరలిస్తున్న ముఠాను పట్టుకున్నట్లు డీఎఫ్‌వో రోహిత్ గోపిడి తెలిపారు. ఈ ఘటనలో 13 మంది నిందితులు కాగా, 11 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూరులోని అటవీ శాఖ పర్యాటక వనమాలిక వద్ద సీటీఈటీలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎఫ్‌వో ఘటనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ నెల 10వ తేదీన నల్లమలలో పట్టుకున్న అలుగు అమ్మకం, కొనుగోలు చేసే రెండు పార్టీలు అచ్చంపేట మండలం హాజీపూర్‌లో డీల్ చేస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ముఠాను పట్టుకున్నట్లు ఆయన వెల్లడించారు. అలుగును స్వాధీనం చేసుకొని కొనుగోలు చేస్తున్న జడ్చర్ల ప్రాంతానికి చెందిన గంజి బాలరాజును, విక్రయించేందుకు వచ్చిన పదర మండలంలోని పిల్లిగుండ్ల పెంటకు చెందిన శీలం బుడ్డయ్య, శీలం అంజయ్య, భాను ప్రసాద్, మద్దిమడుగు గ్రామానికి చెందిన నిమ్మల భాను ప్రసాద్, నల్గొండ జిల్లా నాగార్జున సాగర్‌లోని చెంచు కాలనీకి చెందిన శీలం ఈదయ్యను అదుపులోకి తీసుకొని మన్ననూరులోని అటవీశాఖ డివిజన్ కార్యాలయానికి తరలించామని తెలిపారు. జడ్చర్లకు చెందిన బాలరాజు అలుగును విక్రయించేందుకు మధ్యవర్తిగా దందా కొనసాగిస్తుండగా, ఈయనతో పాటు అచ్చంపేట ప్రాంతానికి చెందిన పురం సాయికుమార్, గౌతమ్, కల్వకుర్తికి చెందిన రమేష్, సంగారెడ్డి జిల్లాకు చెందిన స్వాతి అనే మహిళలు ఒక ముఠాగా ఏర్పడి ఈ దందాకు పూనుకున్నట్లు తమ ప్రాథమిక విచారణలో తేలిందని డీఎఫ్‌వో స్పష్టం చేశారు. ఈ నెల 5వ తేదీన పదర మండలం శీలం బుడ్డయ్య నేతృత్వంలో మద్దిమడుగు అటవీ రేంజ్‌లోని చుక్కల గుండం ప్రాంతంలో అలుగును పట్టుకున్నట్లు ఆయన వివరించారు. ఈ ఘటనలో మొత్తం 13 మంది పాత్ర ఉన్నట్లుగా గుర్తించారు. పై వారితో పాటుగా పదర మండలానికి చెందిన మండ్లి వీరయ్య, చిగుర్ల అంజి, జెల్ల బయ్యన్నలు సైతం అలుగు అమ్మే బృందంలో నింధితులుగా గుర్తించారు. 11 మందిని మంగళవారం సాయంత్రం రిమాండ్ చేసి జడ్జి ముందు ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. కల్వకుర్తికి చెందిన రమేష్, మండ్లి వీరయ్యలు పరారీలో ఉన్నారని, వీరిని సైతం పట్టుకునేందుకు అటవీ అధికారుల బృందం సోదాలు నిర్వహిస్తోందని తెలిపారు. నాలుగు మాసాల క్రితం రెండు సార్లు అలుగును అక్రమ రవాణా చేశారనే సమాచారం ఉందని, తాజాగా ఈ నెల 11న రంగారెడ్డి జిల్లాలోనూ ఒక అలుగు దొరికిందని, ఇక్కడి ముఠాకు సైతం అలుగు విక్రయించే దందాలో పాత్ర ఉన్నట్లుగా తెలుస్తోందని వివరించారు. పూర్తి విచారణ తర్వాత ఇది ఎక్కడికి రవాణా చేస్తున్నారు, దీంట్లో ప్రధాన పాత్రధారులెవరో నిజాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని డీఎఫ్‌వో వివరించారు. సమావేశంలో ఫ్లయింగ్ స్క్వాడ్ ఎఫ్‌డీవో రామ్మోహన్, అచ్చంపేట, అమ్రాబాద్ ఎఫ్‌డీవోలు తిరుమల్‌రావు, రామమూర్తి పాల్గొన్నారు.


అలుగును మార్కెటింగ్ చేస్తున్న నిందితులతో డీఎఫ్‌వో రోహిత్ గోపిడి, అటవీ అధికారులు

పటిష్టమైన పునాదులతో టీడీపీ నిర్మాణం

● పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నరసింహులు

వనపర్తి టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పటిష్టమైన కార్యకర్తల సభ్యత్వాల పునాదులపై నిర్మితమైన టీడీపీ నేటికి రాష్ట్రంలో బలంగా ఉందని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నరసింహులు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ బొలెమోని రాములు ఆధ్వర్యంలో చేపట్టారు. కార్యక్రమానికి బక్కని నరసింహులు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ ప్రజలకు టీడీపీ రాజకీయంగా తోడుగా నిలవడమే కాకుండా, రాజకీయ చైతన్యం తీసుకొచ్చిందని అన్నారు. హైదరాబాద్ మహా నగరాన్ని అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన ఘనత కూడా టీడీపీదేనని అన్నారు. తెలుగు దేశం పిలుస్తోందిరా! కదలిరా! అన్న నినాదంతో రాష్ట్ర ప్రజలకు పక్కా గృహాలు, రూ.2కిలో బియ్యం, జనతా వస్త్రాలు ప్రవేశ పెట్టి, ఆడబిడ్డలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించిన పార్టీ తెలుగు దేశమే అన్నారు. రాష్ట్ర అభివృద్ధిని కోరుకునే ప్రతీఒక్కరు రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు విధిగా తెలుగుదేశం పార్టీ సభ్యత్వాన్ని అధిక సంఖ్యలో నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ కన్వీనర్లు కొల్లాపూర్ సుధాకర్ నాయుడు, అలంపూర్ సుధాకర్‌గౌడ్, గద్వాల గోవిందు, వనపర్తి వెంకటయ్య యాదవ్, నాగర్‌కర్నూల్ కొప్పుల రమేష్, అచ్చంపేట సత్యం, కల్వకుర్తి యాది లాల్, నాయకులు ఎండీ దస్తగిరి, షాకీర్ హుస్సేన్, హోటల్ బలరాం, బాలరాజు, గోపాలకృష్ణ నాయుడు, కోమరిగిరి, శంకర్, బాలయ్య తదితరులు ఉన్నారు.


ఆన్‌లైన్ ద్వారా టీడీపీ సభ్యత్వాలు అందిస్తున్న బక్కని నరసింహులు, రాములు

స్పోర్ట్స్ బాక్స్

కొనసాగుతున్న జోనల్ స్పోర్ట్స్ మీట్

» పాల్గొంటున్న 680 మంది విద్యార్థులు



పోటీలో తలపడుతున్న జడ్చర్ల, నారాయణపేట జట్లు

జడ్చర్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం చిట్టబోయిన్‌పల్లి సాంఘిక, సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 10వ జోనల్ స్పోర్ట్స్ మీట్ రెండవ రోజుకు చేరింది. ఈ పోటీల్లో మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లోని ఎనిమిది బాలికల సాంఘిక, సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలకు చెందిన 680 మంది విద్యార్థులు పాల్గొంటున్నారు. అండర్-14, అండర్-17, అండర్-19 విభాగాలలో 11 రకాల క్రీడా పోటీలను నిర్వహిస్తున్నారు. టోర్నీలో భాగంగా ఖోఖో అండర్-19 విభాగంలో జడ్చర్ల, ఊట్కూరు జట్లు, ఫుట్‌బాల్ అండర్-17 విభాగంలో జడ్చర్ల, నారాయణపేట జట్లు, కబడ్డీ అండర్-14 విభాగంలో మరికల్, నారాయణపేట జట్ల మధ్య పోటీలు జరిగాయి. వీటితో పాటు మరికొన్ని విభాగాల్లో పోటీలను నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగే పోటీల అనంతరం ఈ 14న ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనిత వెల్లడించారు.

గో-గేమ్ టోర్నీలో విజేతలుగా నిలవాలి

» మహబూబ్‌నగర్ 37వ వార్డు కౌన్సిలర్ స్వప్న



గో-గేమ్ జట్టు సభ్యులతో అసోసియేషన్ సభ్యులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబర్ 12 : జాతీయ స్థాయి గో-గేమ్ టోర్నీలో ప్రతిభ చాటి, విజేతలుగా నిలవాలని పాలమూరు 37వ వార్డు కౌన్సిలర్ స్వప్న అన్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలో ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయ స్థాయి సబ్ జూనియర్, జూనియర్ గో-గేమ్ టోర్నీలో పాల్గొనేందుకు రాష్ట్ర బాల, బాలికల జట్లు తరలివెళ్లాయి. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జట్టు క్రీడాకారులను ఆమె అభినందించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో ప్రతిభావంతులైన క్రీడాకారులకు కొదవలేదని, ఎంతో మంది రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నసురుల్లా హైదర్, వైస్ ప్రెసిడెంట్ మహ్మద్ షకీల్ అహ్మద్, కార్యదర్శి అఫ్రోజ్, అర్జున్ పాల్గొన్నారు.

ఈనెల 15న హాకీ పురుషుల జట్టు ఎంపిక

పాలమూరు యూనివర్సిటీ, అక్టోబర్ (ఆంధ్రజ్యోతి) 12 : హాకీ పురుషుల జట్టు ఎంపిక పోటీలను ఈనెల 15న నిర్వహిస్తున్నట్లు పీడీ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ సౌత్‌జోన్ గేమ్స్ కోసం, వనపర్తి బాలుర కళాశాల మైదానంలో పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు తమిళనాడులోని డాక్టర్ అంబేడ్కర్ లా యూనివర్సిటీలో నిర్వహించనున్న సౌత్ జోన్ గేమ్స్ పోటీల్లో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.



డి బూడిదపాడు గ్రామంలో ఉల్లిని గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

తగ్గిన దిగుబడి పెరిగిన ధర

» గత ఏడాది కన్నా తగ్గిన ఉల్లి సాగు » అధిక వర్షాలతో దెబ్బతిన్న పంట

» మార్కెట్లో గతం కంటే పెరిగిన ధర » రైతులకు ఉపశమనం

ఉండవల్లి, నవంబరు 12 (ఆంధ్యజ్యోతి) : ఈ ఏడాది ఉల్లి దిగుబడి తగ్గింది. ధర మాత్రం గత సంవత్సరం కన్నా కొంత పెరిగింది. దీంతో రైతుల పరిస్థితి కొంత ఖేదం.. కొంత మోదం అన్నట్లుగా ఉంది. గత రెండేళ్ల ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో ఉల్లి సాగు చేసిన రైతులు నష్టాలను మూటకట్టుకున్నారు. ఈ సంవత్సరం కూడా అదే పరిస్థితి ఉంటుందేమోనన్న సందేహంతో ఎక్కువ మంది రైతులు ఉల్లి సాగుకు ఆసక్తి చూపలేదు. దీంతో సాగు విస్తీర్ణం తగ్గింది. దీనికి తోడు అధిక వర్షాలు కురవడంతో వేసిన పంట చాలా వరకు దెబ్బతిన్నది. దీంతో దిగుబడి కూడా గతం కంటే తగ్గింది.

తగ్గిన సాగు విస్తీర్ణం

జోగుళాంబ గద్వాల జిల్లాలో ఈ ఏడాది 1,251 మంది రైతులు 2012 ఎకరాల్లో ఉల్లి సాగు చేశారు. అత్యధికంగా అలంపూర్ మండలంలో 806, మానవపాడు మండలంలో 226 ఎకరాల్లో సాగయ్యింది. ఉండవల్లి మండలంలో గత ఏడాది 423 మంది రైతులు 745 ఎకరాల్లో ఉల్లి పంటను సాగు చేశారు. ఎకరాకు దాదాపు 35 నుంచి 40 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. కానీ సరైన ధర రాకపోవడంతో రైతులు నష్టపోయారు. ఈ ఏడాది 398 మంది రైతులు 665 ఎకరాల్లో మాత్రమే ఉల్లి సాగు చేశారు. పంట చేతికి అందే సమయంలో అధిక వర్షాలు కురవడంలో తెగులు ఆశించి దిగుబడి తగ్గిపోయింది. ఎకరానికి 25 నుంచి 30 క్వింటాళ్ల లోపే దిగుబడి వచ్చింది. సాగు ఖర్చు ఎకరానికి 50 వేలకు పైగా అయ్యిందని రైతులు చెప్తున్నారు. అయితే గత ఏడాది రూ. 2,500 నుంచి మూడు వేల రూపాయల వరకు ధర పలికింది. అది కూడా కొద్ది రోజులు మాత్రమే కొనసాగింది. ఈ ఏడాది నెల రోజులుగా స్థిరంగా ఉంటోంది. కనిష్ఠం రెండు వేల రూపాయల నుంచి గరిష్ఠం నాలుగు వేల రూపాయల వరకు ధర పలుకుతోంది. ఉల్లి సాగు ఖర్చు, పెట్టుబడి ఎక్కువైనా, వచ్చిన దిగుబడికి మంచి ధర పలుకుతుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మంచి ధర పలికింది



జి. రఘునాథ్ రెడ్డి, రైతు, ఉండవల్లి : మూడు సంవత్సరాలుగా ఉల్లి పంటను సాగు చేస్తున్నాను. ఈ ఏడాది రెండు ఎకరాల్లోసాగు చేయగా, మొత్తం 75 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. గడ్డ నాణ్యంగా ఉండటంతో కర్నూలు మార్కెట్‌కు తీసుకెళ్లగా క్వింటాలుకు రూ. 3800 చొప్పున ధర లభించింది. అధిక వర్షాలతో కొంత ఇబ్బంది పడినా, మార్కెట్లో మంచి ధర పలకడంతో ఉపశమనం కలిగింది.

అమ్ముకునేందుకూ అవస్థలు

ఆరు గాలం కష్టపడి ఉల్లి సాగు చేసినా, వచ్చిన దిగుబడిని అమ్ముకునేందుకు రైతులు నానా కష్టాలు పడాల్సి వస్తోంది. గతంలో వ్యాపారులు అలంపూర్ చౌరస్తాలో ఉల్లి కొను గోలు కేంద్రం ఏర్పాటు చేశారు. కానీ లావా దేవీలకు ఆసక్తి చూపకపోవడంతో కొనుగోలు కేంద్రాన్ని ఎత్తేశారు. దీంతో ఉల్లిగడ్డలను విక్ర యించేందుకు కర్నూలు లేదా చిలకలూరిపేట మార్కెట్లకు వెళ్లాల్సి వస్తోంది. ఆయా ప్రాంతా ల్లోనూ ఉల్లి సాగు అధికంగా ఉండటం, మా ర్కెట్‌కు అధిక దిగుబడులు వస్తుండటంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల కర్నూలు మార్కెట్‌కు ఉల్లిగడ్డలు అత్యధికంగా రావడంతో మార్కెట్లో స్థలం సరిపోలేదు. దీంతో ట్రాక్టర్లను గంటల తరబడి రోడ్లపైనే నిలిపి వేశారు. దీంతో రైతులు ఇబ్బంది పడ్డారు.

అధిక వర్షాలతో తెగులు



లింగస్వామి, రైతు, ఉండవల్లి : నేను ఈ ఏడాది 2.30 ఎకరాలల్లో ఉల్లి పంటను సాగు చేశాను. మొదట్లో బాగానే ఉన్నా, ఆ తర్వాత అధిక వర్షాలు కురవడంతో సగం పంట మురిగిపోయింది. కొంత కోతకు గురయ్యింది. అదే సమయంలో మజ్జిగ తెగులు ఆశించడంతో దిగుబడి తక్కువగా వచ్చింది. 100 క్వింటాళ్లకు పైగా దిగుబడి వస్తుందని ఆశించగా, 67 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చింది. కానీ మార్కెట్లో రూ.3,960కి అమ్మడంతో పెట్టుబడి పోను ఇరవై వేల రూపాయలు మిగలడంతో ఉపశమనం కలిగింది.



ఉండవల్లి మండలంలో రైతులు సాగు చేసిన ఉల్లి పంట (ఫైల్)

క్రైం కార్నర్

బంగారం, వెండి చోరీ

ఊర్కొండ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకుర్తి మండలంలోని మాదారం గ్రామంలోని ఓ ఇంట్లో దొంగలు చొరబడి బంగారం, వెండి ఎత్తుకెళ్లారు. ఎస్‌ఐ వీరబాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బోయ కుర్మయ్య తండ్రి ఆంజనేయులు ఇటీవల మృతి చెందాడు. దశదిన కర్మ అనంతరం నిద్ర చేసేందుకు సోమవారం కుటుంబ సభ్యులతో కలిసి మండలంలోని ఊర్కొండ పేట అభయాంజనేయ స్వామి ఆలయానికి వెళ్లారు. అదే రోజు రాత్రి వారి ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడినట్లు పక్కింటి వారు గమనించి, కుటుంబ సభ్యులకు తెలిపారు. వారు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్‌ఐ సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. కుటుంబసభ్యులతో కలిసి ఇంట్లో పరిశీలించగా, రెండు తులాల బంగారం, ఇరవై తులాల వెండి వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించారు. బాధితుడు కురుమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

పెబ్బేరు ,నవంబరు12 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా పెబ్బేరు మునిసిపాలిటీ పరిధి లోని చెలిమిల్ల గ్రామానికి చెందిన ధూపం పెద్దయ్య (55) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ధూపం పెద్దయ్య సోమ వారం కుటుంబ సభ్యులతో ఘర్షణ పడ్డారు. ఆ తర్వాత ఏమైందో తెలియదు కానీ, మంగళవారం తెల్లవారుజామున ఇంట్లో అడ్డ పంచెతో ఉరి వేసుకొని కన్పించాడు. అతడి మృతిపై అనుమానాలున్నట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి

చిన్నచింతకుంట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలోని అమ్మాపూర్ సమీపంలోని కురుమూర్తి జాతరలో మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వృద్ధుడు (70) మృతి చెందాడు. మైదానంలోని సబ్‌స్టేషన్ వెనుక ఆయన మృతదేహం పడి ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

వివాహిత అదృశ్యం, కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఓ వివాహిత అదృశ్యమైంది. ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని న్యూ టీచర్స్ కాలనీలో నివసిస్తున్న గన్నోజు భాస్కరాచార్య భార్య శిల్ప సోమవారం మధ్యాహ్నం గుడికి వెళ్లి వస్తానని ఇంటి నుంచి బయటకు వెళ్లింది. రోజు గడిచినా ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

53 మంది కూలీలకు గాయాలు

» కొత్తకోట మండలం కనిమెట్ట వద్ద బొలెరో బోల్తా
» 35 మందికి గాయాలు, వారిలో ఐదుగురికి తీవ్ర గాయాలు
» ముగ్గురి పరిస్థితి విషమం, హైదరాబాద్‌కు తరలింపు
» జడ్చర్ల మండలంలో మరో ప్రమాదం
» 18 మందికి గాయాలు



కనిమెట్ట శివారులో బోల్తా పడిన వాహనం



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వృద్ధురాలు

కొత్తకోట/ జడ్చర్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పాలమూరులో మంగళవారం జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో 53 మంది కూలీలు గాయపడ్డారు. వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని బూత్కూర్ గ్రామానికి చెందిన 35 మంది మహిళా కూలీలు పని కోసం మహబూబ్‌నగర్ జిల్లా కౌకుంట్ల మండలంలోని వర్నె, ముత్యాలంపల్లి, వెంకంపల్లి గ్రామాలకు బొలెరో వాహనంలో బయలు దేరారు. జాతీయ రహదారిపై కనిమెట్ట గ్రామ శివారులో వాహనం టైర్ పంక్చరై బోల్తా పడింది. సమీపంలో ధాన్యం తూకాలు వేస్తున్న హమాలీలు గమనించి, కూలీలను వాహనంలో నుంచి బయటకు తీశారు. పోలీసులకు సమాచారం అందించడంతో పాటు, 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. దీంతో ఎస్‌ఐ మంజునాథ్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను వనపర్తి జిల్లా ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాలైన అబ్బులమ్మ, రేణుకమ్మ, జయమ్మ, సావిత్రి, చిట్టెమ్మలను మెరుగైన వైద్యం కోసం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఎస్ఎస్ ఆసుపత్రులకు తరలించారు. వారిలో పరిస్థితి విషమంగా ఉన్న అబ్బులమ్మ, జయమ్మలను హైదరాబాద్‌కు, రేణుకమ్మను కర్నూల్ ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు.

పెద్ద ఆదిరాల వద్ద ట్రాక్టర్ ట్రాలీ బోల్తా

మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మండలం పెద్దఆదిరాల శివారులో ట్రాక్టర్ ట్రాలీ బోల్తా పడి, 18 మంది కూలీలు గాయపడ్డారు. పెద్ద ఆదిరాలకు చెందిన ఓ రైతు పొలంలో పత్తి తీసేందుకు 18 కూలీలు ట్రాక్టర్ ట్రాలీలో వస్తుండగా, గ్రామ శివారులో ప్రమాదవశాత్తు బోల్తాపడింది. దీంతో ట్రాలీలో ఉన్న కూలీలు గాయపడ్డారు. వారిని జడ్చర్ల పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కూలీలు లలితమ్మ, సుజాత, అనిత, సుజాత, జంగమ్మ, కృష్ణవేణి, ఊర్మిళ, ఎల్లమ్మ, కృష్ణమ్మలను బీఆర్ఎస్ నాయకులు కోడ్గల్ యాదయ్య, రఘుపతిరెడ్డి, శంకర్‌నాయక్, రామలింగారెడ్డి, సురేశ్, యాదయ్యతో పాటు పలువురు నాయకులు పరామర్శించారు.



బాధితులను పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మెట్టు మెట్టుకు దీపం, బొట్టు

» మొక్కులు తీర్చుకుంటున్న మహిళా భక్తులు
» వైభవంగా కొనసాగుతున్న కురుమూర్తి బ్రహ్మోత్సవాలు

చిన్నచింతకుంట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కురుమూర్తి క్షేత్రంలో భక్తులు మెట్టు మెట్టుకు బొట్టు పెట్టి, దీపం వెలిగించి మొక్కులు తీర్చుకుంటున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలో కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. స్వామివారిని దర్శించుకునేందు మంగళవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. గుట్ట మీదున్న క్యూ లైన్లలో రద్దీ కనిపించింది. జాతర మైదానంలో భక్తులు స్వామి వారికి దాసంగాలు సమర్పించారు.



మెట్టు మెట్టుకూ దీపం వెలిగిస్తున్న మహిళలు



మోకాళ్లపై మెట్లు ఎక్కుతున్న మహిళా భక్తురాలు



హుండీలోని నగదును లెక్కిస్తున్న భక్తులు

కురుమూర్తి హుండీ లెక్కింపు

» సమకూరిన రూ 25.54 లక్షలు

చిన్నచింతకుంట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలోని అమ్మాపూర్ సమీపంలోని కురుమూర్తి వేంకటేశ్వర ఆలయంలో హుండీలను మంగళవారం లెక్కించారు. రూ. 25,54,805 ఆదాయం సమకూరినట్లు ఈవో మదనేశ్వర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, పాలక మండలి సభ్యులు భారతి, నెల్లి ప్రభాకర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, శేఖర్, భాస్కరాచారి, కమలాకర్‌తో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..



గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు

- చంద్రశేఖర్, మండల ప్రాథమిక వైద్యాధికారి

పాన్‌గల్, నవంబరు 12, (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో స్త్రీలు, ప్రజలకు మెరుగైన వైద్య సేవలందిస్తున్నామని మండల ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్ మంగళవారం ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు

మండలంలో ఎన్ని సబ్ సెంటర్లు ఉన్నాయి?

గ్రామాల్లో 10 సబ్ సెంటర్లు ఉన్నాయి.

ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలు నిర్వహిస్తున్నారా?

ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలు నిర్వహిస్తున్నాం. వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలతో గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం.

కుక్కకాటుకు వ్యాక్సిన్ అందుబాటులో ఉందా?

వ్యాక్సిన్ అందుబాటులో ఉంది. ఎవరైనా కుక్క కాటు, పాముకాటు, కోతుల కాటుకు గురైతే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి వ్యాక్సిన్ వేయించుకోవాలి.

చిన్నారులకు టీకీకరణ చేస్తున్నారా?

ప్రతి బుధ, శనివారాల్లో అన్ని గ్రామాల్లో ప్రతీ చిన్నారికి టీకీకరణ చేస్తున్నాం.

గర్భిణులకు పరీక్షలు నిర్వహిస్తున్నారా?

గర్భిణిగా నమోదయినప్పటి నుంచి ఆశా కార్యకర్తల ద్వారా 102 వాహనం ద్వారా ఆసుపత్రికి తరలించి చికిత్సలు నిర్వహిస్తున్నాం.

రోగులకు వైద్య పరీక్షలు



మెగా వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

అమరచింత, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ స్మార్ట్ డాక్స్ బిజినెస్ సొల్యూషన్ ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో మంగళవారం అమరచింత ప్రభుత్వ హైస్కూల్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని మునిసిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ నాగభూషనం గౌడ్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. శిబిరంలో అనుభవజ్ఞులైన వనపర్తి, ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రుల జనరల్ సర్జన్, కంటి వైద్య నిపుణులు, చిన్న పిల్లల డాక్టర్లు, దంత వైద్య నిపుణులు, ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్ బీపీ, షుగర్‌కు సంబంధించిన వైద్యులతో 100 మంది రోగులు ఈ శిబిరంలో పరీక్షలు చేయించుకుని ఉచిత మందులు తీసుకున్నారు. వైద్యులు ఆనంద్, శృతి, తిరుమల హరీష్, కృష్ణ, సయ్యద్ కలాం పాషా, దుబాయ్ షైను, కృష్ణవేణి, డాక్టర్ హరి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల సంక్షేమానికి నిర్వహించే స్వచ్ఛంద ఆశ్రమాలు, పాఠశాలలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని జిల్లా సంక్షేమశాఖ అధికారిని లక్ష్మమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఆశ్రమాలు, సంస్థలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. దివ్యాంగుల సంక్షేమ చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్ కోసం ఈ నెల 14వ తేదీ లోపు జిల్లా కేంద్రంలోని ఐడీవోసీ రూమ్ నంబర్ 18లో తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 15వ తేదీ తరువాత రిజిస్ట్రేషన్ చేసుకుని సంస్థలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం



ఎన్నికైన వెంకట్రాములు

మదనాపురం, నవంబరు 12, (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు వెంకట్రాములు అన్నారు. ఈ నెల 10, 11 తేదీల్లో జరిగిన పార్టీ జిల్లా 3వ మహాసభలో మదనాపురం మండలం అజ్జకొల్లుకు చెందిన వెంకట్రాములు జిల్లా కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేద ప్రజల సమస్యలపై నిరంతరం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో పని చేస్తూ అలుపెరుగని పోరాటాలు కొనసాగిస్తామన్నారు. రాబోయే కాలంలో పార్టీని కార్యకర్తల సమన్వయంతో బలోపేతం చేస్తామని పేర్కొన్నారు.

వైద్య సిబ్బంది జాగ్రత్తలు పాటించాలి

వీపనగండ్ల, నవంబరు 12, (ఆంధ్రజ్యోతి): మాతా శిశు సంరక్షణలో వైద్య సిబ్బంది జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ రాజశేఖర్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆశ కార్యకర్తలకు రిజిస్టర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పల్లె దవాఖానా డాక్టర్లు సూపర్‌వైజర్లు, ప్రజా ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. కరుణశ్రీ, సూపర్‌వైజర్లు దయామని, కేశవులు, కమలమ్మ పాల్గొన్నారు.

నీటి వసతి లేక మరుగుదొడ్లు వృథా

- మహిళా సమాఖ్యలో కాలకృత్యాలకు అవస్థలు పడుతున్న మహిళలు - పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



వృథాగా మరుగుదొడ్లు, బాత్‌రూమ్‌లు



మహిళా సమాఖ్య భవనం

పాన్‌గల్, నవంబరు 12, (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో నీటి వసతి లేక ఉద్యోగులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో నిర్మించిన మహిళా సమాఖ్య భవనం గుట్టల ప్రాంతంలో నిర్మించడంతో నీటి వసతి కల్పించేందుకు బోరు మోటార్ సౌకర్యం లేకపోవడంతో నీటి వసతి లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మహిళా సంఘాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నా ఆచరణలో అమలు కావడం లేదు. స్థానికంగా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదు. ప్రతీ నెల నిర్వహించే సమావేశాలకు హాజరయ్యే ఈసీ మెంబర్లు, విలేజ్ బుక్ కీపర్లు, వికలాంగులు కాలకృత్యాలు తీర్చుకునేందుకు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మహిళా సంఘాలను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ఎక్సైజ్ అండ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పది సంవత్సరాల కిందట తన సొంత నిధులతో భూమి కొనుగోలు చేసి మహిళా సమాఖ్య భవనం నిర్మించినా... నీటి వసతి లేక అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నూతన బోరు మోటార్, పైపు లైన్ ఏర్పాటు చేసి నీటి వసతి కల్పించి మహిళల ఇక్కట్లు తీర్చాలని కోరుతున్నారు.

ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం..



మహిళా సమాఖ్య భవనంలో నీటి వసతి లేక ఉద్యోగులు, సమావేశానికి హాజరయ్యే మహిళలు, కాలకృత్యాలు తీర్చుకు నేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించాలి.

- కుల్సుంబేగం, ఆఫీస్ సబార్డినేటర్

సమస్యలు పరిష్కరించాలి..



మహిళా సమాఖ్య భవనంలో నీటి వసతి లేక మహిళలు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకొని నీటి వసతి కల్పించి సమస్య పరిష్కరించాలి.

- సక్రునాయక్ ఏపీఎం

మహిళల ఆర్థిక బలోపేతానికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా ,నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మహిళలను ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను గ్రౌండింగ్ చేసేందుకు కృషి చేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడీవోసీ సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశానికి కలెక్టర్ హాజరై మాట్లాడారు. జిల్లాలో మహిళా సాధికారత కోసం వివిధ పథకాల అమలు వాటి నివేదికలను పరిశీలించారు. మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు బ్యాంకు లింకేజీ రుణాలు సూక్ష్మ సంస్థలు, పాడి పరిశ్రమ, పౌల్ట్రీ, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, మహిళా శక్తి క్యాంటిన్‌ల ఏర్పాటు వంటి పథకాలు ఆశించిన స్థాయిలో గ్రౌండింగ్ కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్కో పథకాన్ని మండలాల వారీగా వారు ఇప్పటి వరకు సాధించిన లక్ష్యాలు, వెనుకబడిపోవడానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి మండలానికి, ఏపీఎంకు ఇచ్చిన లక్ష్యాలను త్వరగా గ్రౌండింగ్ చేయాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీ సంచిత్ గంగ్వార్, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి ఉమాదేవి, లీడ్ బ్యాంకు సహా మేనేజర్ సాయి, ఏపీఎంలు , డీపీఎంలు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బందులు పెట్టొద్దు

గోపాల్‌పేట : అలసత్వం లేకుండా సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. మంగళవారం మండలంలోని చెన్నూర్, తాడిపత్రి గ్రామల్లో నిర్వహిస్తున్న సర్వేను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఎన్యుమరేటర్లు సర్వే నిర్వహిస్తునప్పుడు తప్పులు చోటుచేసుకోకుండా చుసుకోవాలని ఏ ఒక ఇల్లు వదలకుండా సర్వే చేయాలని అన్నారు. ఎన్యుమరేటర్లను సర్వే నిర్వహిస్తున్న సమయంలో సూపర్‌వైజర్లు తనిఖీ చేయాలని ఆదేశించారు. ఎన్యుమరేటర్లు ప్రతీ రోజు ఎన్ని ఇళ్లు సర్వే చేశారో స్ప్రెడ్ షీట్ లో నమోదు చేయాలని సూచించారు. ప్రజలు సర్వే సిబ్బందికి సహకరించి పూర్తి సమాచారం అందించాలని కోరారు. తిలక్ కుమార్ రెడ్డి, శంకర్ కలెక్టర్ వెంట ఉన్నారు.

దక్షిణ తెలంగాణ రైతులపై చిన్న చూపు తగదు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర నాయకులు ఎండీ జబ్బార్

వీపనగండ్ల, నవంబరు 12, (ఆంధ్రజ్యోతి): ఉత్తర తెలంగాణలో కొండపోచమ్మ ప్రాజెక్టు భూనిర్వాసితులకు ఎకరాకు రూ.30 లక్షల నష్టపరిహారం ఇచ్చిన ప్రభుత్వం, దక్షిణ తెలంగాణ లోని పాలమూరు ఉమ్మడి జిల్లాలో చేట్టిన ప్రాజెక్టులో నిర్వాసితులకు రూ.6 లక్షలు ఇస్తామని ప్రభుత్వం చెప్పటం దారుణమని సీపీఎం రాష్ట్ర నాయకులు ఎండీ జబ్బార్ అన్నారు. దక్షిణ తెలంగాణ రైతులపై చిన్న చూపు తగదని అన్నారు. మండల కేంద్రంలో నిర్వహిస్తున్న సీపీఎం జిల్లా మూడో మహాసభలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లా మహాసభలు విజయవంతంగా ముగిశాయని సహకరించిన అందరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మహాసభల సందర్భంగా భవిష్యత్‌లో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై ఉద్యమించడానికి కొన్ని తీర్మానాలను రూపొందించుకొన్నామన్నారు. ఉపాధి హామీ పనులను పట్టణ మునిసిపాలిటీ కేంద్రాల్లో నిర్వహించాలని, పెండింగ్ ప్రాజెక్టు లిఫ్టు పూర్తి చేయాలని, నిర్వాసితుల సమస్యలు, ధరణి సమస్యలు పరిష్కరించాలన్నారు. రైతులను రుణమాఫీ, రైతుభరోసా వెంటనే చెల్లించాలని అన్నారు. జిల్లా కేంద్రంలో వెటర్నరీ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. శ్రీశైలం ముంపు నిర్వాసితులకు 98 జీవో ద్వారా ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఈఎస్ఐ దవాఖానాని ప్రారంభించి ప్రభుత్వ దవాఖానాలో స్కానింగ్ డాక్టర్‌ను నియమించాలని అన్నారు. పుట్టా ఆంజనేయులు, బాల్‌రెడ్డి, గోపి, రాజు, కృష్ణయ్య, ఆది, వెంకటయ్య, ఆశన్న, ఈశ్వర్ పాల్గొన్నారు.

సీపీఎం జిల్లా కార్యదర్శిగా పుట్ట ఆంజనేయులు



ఎన్నికైన ఆంజనేయులు

వనపర్తి టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సీపీఎం జిల్లా కార్యదర్శిగా పుట్ట ఆంజనేయులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీపనగండ్ల మండలంలో రెండు రోజుల పాటు జరిగిన సీపీఎం జిల్లా మూడో మహాసభల్లో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులుగా ఉన్న పుట్ట ఆంజనేయులును జిల్లా కార్యదర్శిగా ఎన్నిక చేశారు. పుట్ట ఆంజనేయులు ఎన్నికపై సీపీఎం పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ.. ఆయనకు అభినందనలు తెలిపారు.

కొనసాగుతున్న కుటుంబ సమగ్ర సర్వే



జూరాలలో సర్వేలో పాల్గొన్న తహసీల్దార్ చాంద్‌పాషా

అమరచింత నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కుటుంబ సమగ్ర సర్వే మంగళవారం ఆయా గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా మునిసిపాలిటీ కేంద్రంతో పాటు నాగల్‌కడుమూర్, నందిమల్ల, కృష్ణంపల్లి, మీట్ట నందిమల్ల, చంద్రఘడ్, నందిమల్ల ఎక్స్‌రోడ్డు, పామిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో సర్వే కొనసాగింది. ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న సర్వేను తహసీల్దార్ రవి కుమార్, ఎంపీడీవో శ్రీనివాసులు, ఏపీఎం శ్రీనివాసులు, ఆర్ఐ గోపాల్, ఎంపీవో నరసింహయ్య, ఎంఈవో భాస్కర్ సింగ్ పర్యవేక్షించారు.

ఆత్మకూరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇంటింటి సమగ్ర సర్వేను వేగవంతం చేయాలని తహసీల్దార్ చాంద్‌పాషా, ఎంపీడీవో సుజాత, ఎంపీవో శ్రీరామ్ రెడ్డి పేర్కొన్నారు. ఆత్మకూరు మండల పరిధిలోని జూరాల, మేడపల్లి, గుంటుపల్లి గ్రామాల్లో చేపట్టిన ఇంటింటి సమగ్ర సర్వేను వారు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడారు. ఇప్పటి వరకు 30 శాతం ఇంటింటి సర్వే పూర్తి చేసినట్లు చెప్పారు.

ఖిల్లాఘణపురం : మండలంలోని సల్కెలాపూర్, అప్పారెడ్డిపల్లి గ్రామాల్లో కొనసాగుతున్న సర్వేను మంగళవారం తహసీల్దార్ సుగుణ పరిశీలించి సర్వేలో పాల్గొన్న ఎన్యుమరేట్లకు సూచనలు చేశారు.

మండలంలో నేటి వరకు 2,813 మంది కుటుంబాల వివరాలు సేకరించామన్నారు.



సల్కెలాపూర్‌లో సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ సుగుణ

న్యూస్ బాక్స్

14న ఉద్యోగ మేళా

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో గురువారం ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి ఎండీ జానీపాషా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగ మేళకు బీఎఫ్ఐఎల్, విజయ బయో ఫర్టిలైజర్స్, న్యూ స్మార్ట్ ఫాస్ట్ సొల్యూషన్స్, క్రెడిట్ యాక్సిస్ గ్రామీణ్ అండ్ ఎస్ఎస్ఎస్‌వీ సొల్యూషన్స్ కంపెనీలు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. నిరుద్యోగులకు మొత్తం 675 ఉద్యోగాలు కల్పించనున్నట్లు వివరించారు. ఉద్యోగ స్థాయిని బట్టి రూ.14 వేల నుంచి రూ.20 వేల వరకు వేతనాలు లభిస్తాయన్నారు. పదో తరగతి ఇంటర్, డిగ్రీ, బి ఫార్మసీ చదివిన 18 నుంచి 30 ఏళ్ల లోపు యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నిరుద్యోగులు బయోడేటాతో, తమ సర్టిఫికెట్లతో ఈ నెల 14న ఉదయం 10:30 గంటలకు పీఎంకెకె సెంటర్, సరస్వతీ శిశు మందిర్, రామాలయం పక్కన వనపర్తి పట్టణంలో హాజరు కావాలన్నారు.

వాకింగ్, రన్నింగ్ ట్రాక్ పనుల పరిశీలన



ట్రాక్‌ను పరిశీలిస్తున్న చైర్ పర్సన్ గాయత్రి

ఆత్మకూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని జాతర మైదానంలోని మినీ స్టేడియంలో కలెక్టర్ నిధులతో చేపట్టిన వాకింగ్ రన్నింగ్ ట్రాక్ పనులను మంగళవారం ఆత్మకూరు మునిసిపల్ చైర్‌పర్సన్ గాయత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ట్రాక్‌ల పనుల నిమిత్తం డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి రూ.16 లక్షలు 2023 ఫిబ్రవరి నెలలో మంజూరయ్యాయని చెప్పారు. అందులో భాగంగానే ట్రాక్ పనులను చేపట్టామన్నారు. పట్టణంలోని యువకులు, వాకర్స్, మహిళలు, పెద్దలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వాకింగ్ అనంతరం విశ్రాంతి పొందేందుకు సువిశాలమైన రెండు పార్కులను ఏర్పాటు చేశామని తెలిపారు.

పెబ్బేరు మునిసిపల్ కమిషనర్‌గా గణేష్



పెబ్బేరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పెబ్బేరు మునిసిపాలిటీలో మేనేజర్‌గా పని చేస్తున్న గణేష్‌ను మునిసిపల్ కమిషనర్‌గా కలెక్టర్ నియమించారు. గతంలో పనిచేసిన కమిషనర్ ఆదిశేషు లంచం తీసుకుంటుండగా.. అవినీతి అధికారులు పట్టుకోవడంతో అతడిని కమిషనర్‌గా తొలగించారు. అనంతరం గణేష్‌ను కమిషనర్‌గా నియమించారు.

మహిళలు, బాలికలకు అండగా చట్టాలు



అవగాహన కల్పిస్తున్న అధికారిని కవిత

పెబ్బేరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మహిళలు, బాల బాలికలకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయని వనపర్తి సఖి సెంటర్ అధికారిని కవిత అన్నారు. పెబ్బేరు పట్టణంలో మంగళవారం మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల బాలికల పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బాలికలకు ఎవరైనా ఇబ్బందులు కలిగిస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాలు ఇంకా కొనసాగుతున్నాయని, వాటిని బాలికలే నివారించాలన్నారు. మహిళలకు బాలికలకు భరోసా షీ టీంలు ఉన్నాయన్నారు. కవిత, సుమా, శ్రీనివాస్, అశోక్, నాగలక్ష్మి, పాల్గొన్నారు.

కుక్కల బెడద నివారించాలి

పెబ్బేరు రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అయ్యవారిపల్లిలో కుక్కల బెడద నివారించాలని గ్రామస్థులు మంగళవారం తహసీల్దార్ లక్ష్మికి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో కుక్కలు ఎక్కువగా ఉండటంతో వాహనాల వెంట, మనుషులపై దాడి చేస్తున్నట్లు తెలిపారు. అధికారులు స్పందించి గ్రామంలో కుక్కలను తరలించాలని కోరుతున్నారు. లక్ష్మణ్, భాస్కర్, బాలకృష్ణ, శ్రీకాంత్, నవీన్ పాల్గొన్నారు.

తరుగు పేరుతో మోసం చేస్తే చర్యలు



వీపనగండ్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

వీపనగండ్ల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వరి కొనుగోలు కేంద్రాల్లో తరుగు పేరుతో ఎక్కువ తూకం వేసి రైతులను మోసం చేస్తే చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హెచ్చరించారు. మంగళవారం వనపర్తి జిల్లా వీపనగండ్ల మండల పరిధిలోని గోవర్ధనగిరి, వీపనగండ్ల, కల్వరాల, సంగినేనిపల్లి, పుల్గర్‌చర్ల గ్రామాలలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. పుల్గర్‌చర్ల గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రైతులు విక్రయించిన ధాన్యానికి కొనుగోలు కేంద్రాల్లోనే రశీదులు ఇవ్వాలని, ధాన్యం మిల్లులకు తరలించిన వెంటనే రైతుల ఖాతాలో డబ్బులు జమ చేయాలని అధికారులను ఆదేశించారు. మహిళా సంఘాలు కొనుగోలు చేసిన ధాన్యం రశీదుల ప్రకారం డబ్బులు చెల్లించాలని తరుగు పేరుతో మిల్లర్లు కోత విధిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. నకిలీ విత్తన కంపెనీలపై ఎందుకు చర్యలు తీసుకోలేదని మంత్రి మండల వ్యవసాయ అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నకిలీ విత్తనాలు విక్రయించిన కంపెనీలపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్‌ను ఫోన్ ద్వారా మంత్రి ఆదేశించారు.

రుణమాఫీలో బ్యాంకర్లు నిర్లక్ష్యం విడాలని మంత్రి జూపల్లి అన్నారు. రుణమాఫీ డబ్బులు ఖాతాలో జమ చేయడంలేదని రైతులు మంత్రి దృష్టికి తెచ్చారు. వెంటనే స్థానిక ఐఓబీ బ్రాంచికి వెళ్లి రైతులను రుణ విముక్తి చేసేందుకు రుణమాఫీ పథకం ప్రభుత్వం చేపట్టిందని, నిర్లక్ష్యం చేయడం తగదని మేనేజర్‌పై మండిపడ్డారు. 2795 మంది ఖాతాలు పెండింగ్‌లో ఉండటం దారుణమన్నారు. సాంకతిక కారణాలతో ఉన్న 1100 ఖాతాల సమస్యను పరిష్కరిస్తామని, పది పదిహేను రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేస్తామని బ్యాంకు అధికారులు చెప్పారు. డీఆర్డీవో ఉమాదేవి, ఏపీఎం బుచ్చన్న, గోదల బీరయ్య, ఇంద్రకంటి వెంకటేష్, పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి



పోలీస్ సిబ్బందికి ఉలెన్ బ్లాంకెట్స్ పంపిణీ చేస్తున్న ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి క్రైమ్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ శాఖ సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకొని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. మంగళవారం పోలీస్ కార్యాలయంలో రిసెప్షన్, స్టేషన్ రైటర్లు, కోర్టు కానిస్టేబుల్స్, వర్టికల్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. వివిధ సమస్యల నిమిత్తం పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం చేయడంతో పాటు స్టేషన్‌లో కనీస సౌకర్యాలు కల్పించాలని సూచించారు. పెరుగుతున్న సైబర్ క్రైమ్ కేసులను దృష్టిలో ఉంచుకొని పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు కేసులను పరిష్కరించాలని ఆదేశించారు.

శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు

జిల్లాలో శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ రావుల గిరిధర్ తెలిపారు. మంగళవారం పోలీస్ కార్యాలయంలో జిల్లా పోలీస్ అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. చాలా కాలం నుంచి పెండింగ్‌లోని కేసులకు సంబంధించిన వాటిని త్వరగా పూర్తి చేసి బాధితులకు న్యాయం చేయాలన్నారు. ఇప్పటి వరకు నమోదైన కేసుల్లో నాన్ గ్రేవ్ కేసులు, గ్రేవ్ కేసుల విషయంలో తీసుకోవాల్సిన చర్యల గురించి పలు సూచనలు చేశారు. దొంగతనాన్ని అరికట్టడంతో పాటు రాత్రివేళలో పెట్రోలింగ్ గస్తీని పెంచాలని, అదే విధంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించి నిఘా వ్యవస్థను పటిష్ఠం చేయాలన్నారు.

విధులతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

పోలీస్ సిబ్బంది విధులతో పాటు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి కాపాడుకోవాలని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో రానున్న శీతాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పోలీస్ సిబ్బందికి ఉలెన్ బ్లాంకెట్స్‌తో పాటు టీ షర్ట్‌లను పంపిణీ చేశారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన

పెద్దమందడి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండల ప్రభుత్వ జూనియర్ కళాశాల, విద్యార్థులకు వనపర్తి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి రజిని మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, వికలాంగులకు, మహిళలకు వరద బాధితులకు మూడు లక్షల లోపు ఆదాయం ఉన్న వారందరికీ ఉచిత న్యాయ సహాయం అందుతుందన్నారు. అదే విధంగా త్వరితగతిన ఉచిత న్యాయ సహాయం పొందుటకు ఎన్ఏఎల్ఎస్ఏ టోల్ ఫ్రీ నెంబర్ 15100 కాల్ చేసి, ఆన్‌లైన్ అప్లికేషన్ పెట్టి న్యాయం సహాయం పొందవచ్చన్నారు. లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా



హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న భక్తులు

అమరచింత, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండల పరిధిలోని సింగంపేట గ్రామం అడివి ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ ఆవరణంలో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాచాల జనార్దన్, మేర్వ రాజు, విష్ణువర్ధన్ రెడ్డి, హరీష్, మల్లారెడ్డి, భాస్కర్ సింగ్ రాజు, విష్ణు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన కనిమెట్ట మహిళలు

కొత్తకోట, నవంబరు (ఆంధ్రజ్యోతి) 12 : మండలంలోని కనిమెట్టకు చెందిన 200 మంది మహిళలు మాజీ సర్పంచ్ సుమిత్ర, మహిళ సంఘం నాయకురాళ్లు అనిత, చెన్నమ్మ, వెంకటమ్మ, నారమ్మ, శ్యామలమ్మ, నాగేంద్రమ్మ ఆధ్వర్యంలో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సతీమణి కవిత సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో మంగళవారం చేరారు. ఈ సందర్భంగా మార్కెట్ చైర్మన్ ప్రశాంత్ మాట్లాడారు. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక మహిళాల అభివృద్ధికే పెద్దపీట వేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల, కొత్తకోట మునిసిపాలిటీ అధ్యక్షులు బీచుపల్లి యాదవ్, శ్రీనువాసులు, శేఖర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, మిషేక్ పాల్గొన్నారు.

బాధితులకు నాయకుల పరామర్శ



గాయపడిన కూలీలను పరామర్శిస్తున్న కవిత

కొత్తకోట, నవంబరు (ఆంధ్రజ్యోతి) 12 : వనపర్తి జిల్లా కనిమెట్ట శివారులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిఇ వనపర్తి జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కూలీ లను పలువురు నాయకులు పరామర్శించారు. బాధితులను దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూద న్‌రెడ్డి సతీమణి కవిత, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, మార్కెట్, సీడీసీ చైర్మన్లు ప్రశాంత్, చంద్రశేఖర్ రెడ్డి పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. అలాగే కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు బీచుపల్లి యాదవ్, శ్రీనివాసులు, శేఖర్‌రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, బంగారయ్య అభిమన్య, విశ్వేశ్వర్, వామన్‌గౌడ్, చెన్న కేశవరెడ్డి పరామర్శించారు.

సకాలంలో వరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం..

వనపర్తి రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కాంటా కోసం తీసుకొచ్చిన వరి ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేస్తామని నాగవరం సహకార సంఘం అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి రైతులకు సూచించారు. మంగళవారం శ్రీనివాసపురం, దత్తాయపల్లి, అంజనగిరి గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆరిన వెంటనే వరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తామన్నారు.

పెబ్బేరు : పెబ్బేరు మునిసిపాలిటీ పరిధిలో మార్కెట్ యార్డులో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ యార్డు చైర్ పర్సన్ గౌని ప్రమోదిని గౌని కోదండరామిరెడ్డి మంగళవారం ప్రారంభించారు.

కొత్తకోట : విలియంకొండ, మిరాసిపల్లి, రాయినిపేట గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మార్కెట్, చెరుకు అభివృద్ధి మండలి చైర్మన్లు ప్రశాంత్, చంద్రశేఖర్‌రెడ్డి ప్రారంభించారు.

అమరచింత : అమరచింతలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.

రేవల్లి : మండల కేంద్రంతో పాటు మండలంలోని కేశంపేట పాతతండా చెన్నరం, గొల్లపల్లి, నాగపూర్, గౌరిదేవిపల్లి, శానాయిపల్లి, తల్పునూరు గ్రామాల్లో మంగళవారం మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు.